

తిరుపతి బులియన్	
బంగారం :	
24 క్యారెట్లు 10 గ్రాములు	రూ.92,500
22 క్యారెట్లు ఒక గ్రాము	రూ.8,366
వెండి:	
హోల్‌సేల్ ధర (కిలో)	రూ.93,200
రిటైల్ వెండి గ్రాము	రూ.96.20

క్లుప్తంగా

ముగిసిన 'పది' మూల్యాంకనం


జవాబు పత్రాల వివరాలు పరిశీలిస్తున్న డీఈఓ

తిరుపతి అర్బన్ : తిరుచానూరు జెడ్పీ ఉన్నత పాఠశాలలో నిర్వహిస్తున్న పదో తరగతి జవాబు పత్రాల మూల్యాంకనం బుధవారంతో ముగిసింది. శ్రీకాకుళం, విజయనగరం, నంద్యాల, అనంతపురం, అనకాపల్లి, పల్నాడు, కోనసీమ జిల్లాలకు చెందిన విద్యార్థుల మొత్తం 1,84,377 జవాబు పత్రాలు తిరుపతిలో మూల్యాంకనం చేశారు. జిల్లాకు చెందిన వివిధ సబ్జెక్టుల టీచర్లను నియమించి మూల్యాంకనం ప్రక్రియను ఎలాంటి ఇబ్బందులు లేకుండా పూర్తి చేశారు. ప్రతిరోజూ ఓఎంఆర్ షీట్లను సీల్ చేసి, పటిష్ట భద్రత నడుమ విజయవాడకు తరలించారు. డీఈఓ కేవీఎస్ కుమార్ మాట్లాడుతూ డీవైఈఓ బాలాజీ, ఎంఈఓ భాస్కర్, ఏఈ గురవారెడ్డి, సీనియర్ అసిస్టెంట్ బి.శిరీష్ కుమార్ ఆధ్వర్యంలో పకడ్బందీగా పర్యవేక్షించినట్లు వివరించారు. ఈ క్రమంలో బుధవారం మధ్యాహ్నం ఆర్జేడీ శామ్యూల్ స్పాట్ కేంద్రాన్ని ఆకస్మిక తనిఖీ చేసినట్లు తెలిపారు.

పాత బస్సులకు.. కొత్త రూపం


రీమోడల్ చేస్తున్న దృశ్యం

'మేమొస్తే ఆర్టీసీని ప్రగతి పథంలో నడిపిస్తాం. కొత్త బస్సులు తీసుకువస్తాం. ముఖ్యంగా తిరుపతి సెంట్రల్ బస్టాండ్‌కు 50 నుంచి 100 కొత్త సర్వీసులు మంజూరు చేస్తాం.. ఉచిత బస్సు ప్రయాణ పథకం కోసం అదనంగా సర్వీసులు ఏర్పాటు చేస్తాం' అని ఎన్నికల ముందు కూటమి నేతలు ఊదరగొట్టారు. అధికారంలోకి వచ్చి నెలలు గడుస్తున్నా..తిరుపతి బస్టాండ్‌కు ఒక్క కొత్త బస్సు కూడా అందించలేదు. చివరకు చేసేది లేక ఆర్టీసీ అధికారులు పాత బస్సులనే రీమోడల్ చేయించాలని నిర్ణయించారు. ఈ మేరకు ప్రభుత్వం నుంచి అనుమతులు పొందారు. ముందుగా తిరుపతి డిపో నుంచే కాలం చెల్లిన వాహనాలకు సరికొత్త రూపం తీసువచ్చే ప్రక్రియకు శ్రీకారం చుట్టారు.

- ఆర్టీసీ సర్వీసుల బాడీ కన్వర్షన్
- తిరుపతి బస్టాండ్ నుంచి శ్రీకారం
- ఇప్పటికే 9 బస్సుల రీ మోడల్
- అదేబాటలో పలు సర్వీసులు


పల్లె వెలుగు బస్సుగా రీమోడల్ అవుతున్న కాలం చెల్లిన బస్సు

తిరుపతి అర్బన్ : ఆధ్యాత్మిక కేంద్రమైన తిరుపతి నగరంలోని సెంట్రల్ బస్టాండ్ ప్రాంగణంలో శ్రీహరి, శ్రీనివాస, ఏడుకొండలు, పల్లెవెలుగు బస్టాండ్లు ఉన్నాయి. ఇక్కడి నుంచి తిరుపతి, మంగళం డిపోలతోపాటు ఇతర డిపోలకు చెందిన సర్వీసులు నడుస్తున్నాయి. తిరుపతి జిల్లాలోని 11 బస్టాండ్ల నుంచి ప్రతి రోజూ 2.70 లక్షల మంది ప్రయాణికులు రాకపోకలు సాగిస్తుండగా తిరుపతి బస్టాండ్ నుంచే 1.60 లక్షల మంది ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణిస్తున్నారు. ఈ సంఖ్యకు తగినట్టు బస్సులు లేవు. ఈ క్రమంలో కాలం చెల్లిన బస్సులను రీ మోడల్‌చేయాలని ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. దీంతో తిరుపతి ఆర్టీసీ డిపోలో పనులు మొదలు పెట్టారు. 15 ఏళ్లు దాటిన ప్రతి సర్వీసునూ రీమోడల్ చేయడానికి చర్యలు చేపట్టారు. ఇందులో భాగంగా తిరుపతి డిపోకు చెందిన సూపర్ లగ్జరీ, అల్ట్రా డీలక్స్ బస్సులను పల్లె వెలుగు బస్సులుగా తీర్చిదిద్దుతున్నారు. ఒక్కొక్కటిగా ప్రయాణికులకు అందుబాటులోకి తీసుకురానున్నారు.

తిరుపతిలో బాడీ కన్వర్షన్

బస్సుల కొరత కారణంగా తిరుపతి ఆర్టీసీ డిపో నుంచి ప్రయాణికులకు తగినన్ని సర్వీసులను నడపలేకపోతున్నారు. ఈ క్రమంలో డీపీటీవో నరసింహులు, డీఎం బాలాజీ ఉన్నతాధికారుల అనుమతుల మేరకు గ్యారేజీ సిబ్బందితో చర్చించి తిరుపతిలో బస్సు బాడీ కన్వర్షన్‌కు శ్రీకారం చుట్టారు. ఇప్పటికే తొమ్మిది సర్వీసులకు మార్పులు చేశారు. పనికొచ్చే పరికరాలు మినహా పాడైన వాటిని తొలగించి స్క్రాప్‌కు వేశారు. రేకులు, చక్కటి సీట్లు, పిల్లర్స్, టైర్లు, లైటింగ్, బ్రేకులు, గేర్ బాక్స్, ఎయిర్ ఫిల్టర్లు, ఇతర సాంకేతిక పరమైన వాటిని కొత్తగా అమర్చుతున్నారు. వీటికి సుమారు రూ.2 లక్షల మేరకు ఖర్చు పెట్టి 52 సీట్ల సామర్థ్యంతో పల్లె వెలుగు బస్సుగా మార్చుతున్నారు. రూట్‌పై వెళ్లిన తర్వాత సమస్యలు వస్తున్నాయా అనే అంశాలపై ప్రత్యేక నిఘా పెడుతున్నారు. గత ఏడాది ఒక డీజిల్ బస్సును విద్యుత్ బస్సుగా మార్పు చేసిన విషయం తెలిసిందే.

> **మెరుగైన సౌకర్యాలు**
>
> 
>
> తిరుపతి ఆర్టీసీ బస్టాండ్‌లో ప్రయాణికులకు మెరుగైన సౌకర్యాలు కల్పిస్తున్నాం. దేశవిదేశాల నుంచి భక్తులు వచ్చిపోతున్న నేపథ్యంలో వారికి ఇబ్బందులు లేకుండా చర్యలు చేపడుతున్నాం. బస్సుల కొరత లేకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నాం. పాత బస్సులకు రూ.2 లక్షల వరకు ఖర్చు చేసి కొత్త రూపాన్ని ఇస్తున్నాం. మెకానిక్స్ ఆర్టీసీ వాళ్లు కావడంతో ఖర్చులు తగ్గుతున్నాయి. రీ మోడల్ తర్వాత నిత్యం వాటిపై నిఘా పెడుతున్నాం. – బాలాజీ, తిరుపతి ఆర్టీసీ డిపో మేనేజర్

సినీ నటుడు సప్తగిరికి మాతృవియోగం

- తిరుపతి గోవిందధామంలో ముగిసిన అంత్యక్రియలు


తల్లి భౌతికకాయానికి నివాళులర్పిస్తున్న సప్తగిరి ప్రసాద్

తిరుపతి రూరల్ : సినీ నటుడు సప్తగిరి ప్రసాద్ తల్లి చిట్టెమ్మ తుదిశ్వాస విడిచారు. కొన్ని రోజులుగా తీవ్ర అనారోగ్యంతో బాధపడుతున్న చిట్టెమ్మ బెంగళూరులోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. ఈ క్రమంలో మంగళవారం రాత్రి ఆమె కన్నుమూశారు. బుధవారం తిరుపతి రూరల్ మండలం శ్రీనివాసపురం పంచాయతీలోని నివాసానికి చిట్టెమ్మ భౌతికకాయం తీసుకువచ్చారు. కన్నతల్లి మరణంతో కన్నీటిపర్యంతమైన సప్తగిరి ప్రసాద్‌ను బంధుమిత్రులు ఓదార్చారు. చిట్టెమ్మ మరణంతో సప్తగిరి గుండెలవిసేలా విలపించడం చూపరులను కదిలించింది. ఈ క్రమంలో సప్తగిరి మిత్రులు, పరిచయం ఉన్న వ్యాపారులు, రాజకీయ నేతలు, సినీ రంగంలో సన్నిహితంగా ఉండేవారు, అభిమానులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి చిట్టెమ్మ పార్థివ దేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం తిరుపతి నగరంలోని గోవింద దామంలో అంత్యక్రియలను పూర్తి చేశారు.

బాధ్యతగా తాబేళ్ల సంరక్షణ


సముద్రంలోకి ఆలివ్ రెడ్లీ తాబేళ్లను వదులుతున్న కలెక్టర్ వెంకటేశ్వర్ తదితరులు

చిల్లకూరు : అంతరించిపోతున్న ఆలివ్ రెడ్లీ తాబేళ్ల సంరక్షణకు ప్రతి ఒక్కరూ బాధ్యతగా సహకరించాలని కలెక్టర్ వెంకటేశ్వర్ పిలుపునిచ్చారు. బుధవారం చిల్లకూరు మండలం గమ్మళ్లదిబ్బ బీచ్ వద్ద అటవీశాఖ, జిందాల్ పరిశ్రమ ఆధ్వర్యంలో ఆలివ్ రెడ్లీ తాబేళ్లను సముద్రంలోకి వదిలిపెట్టారు. కలెక్టర్ మాట్లాడుతూ సముద్రం పరిశుభ్రతకు తాబేళ్లు దోహదపడతాయన్నారు. వాటి పరిరక్షణకు మత్స్యకారులు సైతం కృషి చేయాలని కోరారు. ఇటీవల ఆలివ్ రెడ్లీ తాబేళ్లు పలు ప్రాంతాల్లో మృత్యువాత పడినట్లు ప్రభుత్వం గుర్తించిందన్నారు. దీంతో సముద్రంలో కాలుష్యం పెరిగిపోయే ప్రమాదముందని, అందుకే కేంద్ర ప్రభుత్వం ముందస్తు జాగ్రత్తగా తాబేళ్ల రక్షణ బాధ్యతను స్థానిక పరిశ్రమల యాజమాన్యాలు, స్వచ్ఛంద సంస్థలకు అప్పగించినట్లు వెల్లడించారు. ఈ క్రమంలోనే గమ్మళ్ల దిబ్బతోపాటు కోట మండలం శ్రీనివాసస్రతం బీచ్‌లలో తాబేళ్ల పిల్లలను సముద్రంలోకి వదులుతున్నామన్నారు. దీంతో సముద్రంలో ఎన్ని కిలో మీటర్ల దూరంలో ఉన్నప్పటికీ తాబేళ్లు ఈ బీచ్‌లకే వచ్చి గుడ్లు పెడతాయని వివరించారు. అటవీశాఖ ఆధ్వర్యంలో ఈ గుడ్లను సేకరించి హేచరీల్లో పొదిగిస్తారని తెలిపారు. ఈ నెల 15వ తేదీ నుంచి సముద్రంలో చేపల వేట కూడా ఉన్నందున, ఈ సందర్భంలో పిల్లలు కూడా పెరిగే అవకాశముంటుందని వివరించారు. కార్యక్రమంలో అటవీశాఖ అధికారులు వివేక్, అఫ్జల్, రవీంద్ర, ధనలక్ష్మి, గాయం శ్రీనివాసులు, గోపి, తహసీల్దార్ శ్రీనివాసులు, సర్పంచ్ నెల్లిపూడి సుబ్రమణ్యం, జిందాల్ ప్లాంట్ హెడ్ శ్రీనివాస్‌రావ్, స్థానిక నేతలు వెంకటేశ్వర్లు రెడ్డి, సతీష్‌యాదవ్ పాల్గొన్నారు.

కోట మండలంలో ...

కోట మండలం శ్రీనివాససత్రం బీచ్ వద్ద కలెక్టర్ వెంకటేశ్వర్ చేతుల మీదుగా ఆలివ్‌రెడ్లీ తాబేళ్లను సముద్రంలోకి వదిలారు. కలెక్టర్ మాట్లాడుతూ సమత్స్యకారులు వేట సాగించే సమయంలో తాబేళ్లు వలలకు చిక్కినా వాటిని తిరిగి సముద్రంలోకి వదిలిపెట్టాలని సూచించారు.

చికిత్స పొందుతూ కూలీ మృతి


మృతి చెందిన విజయ్

తిరుపతి క్రైమ్ : అలిపిరి పోలీస్‌స్టేషన్ పరిధిలోని తిమ్మినాయుడుపాళెం వద్ద ఈ నెల 7వ తేదీన ప్రమాదవశాత్తు భవనంపై నుంచి పడిపోయి గాయపడిన కూలీ చికిత్సపొందుతూ బుధవారం మృతి చెందాడు. మధ్యప్రదేశ్కి చెందిన విజయ్(29) భవన నిర్మాణ పనులు చేస్తూ కిందపడ్డాడు. తోటి స్నేహితులు గమనించి హుటాహుటిన ఆస్పత్రికి తరలించగా చికిత్సపొందుతూ మరణించాడు. మృతుడి అన్న మనీష్ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఎస్వీ మెడికల్ కళాశాలకు తరలించారు.

39 రోజులు.. జరిమానా రూ.22.8లక్షలు!

- జాతీయ రహదారిపై పోలీసుల నిరంతర తనిఖీలు
- రాంగ్‌రూట్‌లో వెళుతున్న 912 మందిపై కేసులు


రామానుజపల్లె సర్కిల్ వద్ద రాంగ్‌రూట్‌లో ప్రయాణిస్తున్న వాహన దారులను అడ్డుకుంటున్న పోలీసులు

తిరుపతి రూరల్ : పూతలపట్టు–నాయుడుపేట జాతీయ రహదారిపై పోలీసులు ముమ్మరంగా తనిఖీలు నిర్వహిస్తున్నారు. రోడ్డు భద్రతా నియమాలు పాటించని వారిపై ఉక్కుపాదం మోపుతున్నారు. ప్రధానంగా రాంగ్‌రూట్‌లో వాహనం నడిపేవారికి జరిమానా విధిస్తున్నారు.

ప్రమాదాల నివారణే లక్ష్యం

తిరుచానూరు వద్ద కలెక్టరేట్ నుంచి సి.మల్లవరం జంక్షన్ వరకు జాతీయ రహదారి సమీపంలోని ప్రధాన కూడళ్ల నుంచి ద్విచక్రవాహనాలు, ఆటోలు, కార్లు యథేచ్ఛగా రాంగ్ రూట్‌లో వస్తున్నాయి. దీంతో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. దీనిపై ఎస్పీ హర్షవర్ధన్‌రాజు ప్రత్యేక దృష్టి సారించారు. జాతీయ రహదారిపై నిరంతరం వాహన తనిఖీలు చేసేలా పోలీసులకు ఆదేశాలు జారీ చేశారు. ట్రాఫిక్ డీఎస్పీ రామకృష్ణమాచారి, చంద్రగిరి డీఎస్పీ ప్రసాద్ పర్యవేక్షణలో పకడ్బందీగా తనిఖీలు చేపట్టారు. రాంగ్ రూట్‌లో వస్తే ఎంతటి వారైనా సరే ఉపేక్షించకుండా వాహనాలను పోలీస్ స్టేషన్లకు తరలించేస్తున్నారు. వెంటనే ఎఫ్ఐఆర్ నమోదు చేసి కోర్టుకు పంపుతున్నారు. వాహనం పట్టుకున్న తర్వాత ఎవరి సిఫార్సులను పరిగణనలోకి తీసుకోవడం లేదు.

వందల సంఖ్యలో కేసులు

జాతీయ రహదారిపై రాంగ్ రూట్‌లో వచ్చే వాహనాలకు జరిమానాలు విధించే ప్రక్రియను మార్చి 1వ తేదీ నుంచి పోలీసులు చేపట్టారు. ఇప్పటి వరకు కేవలం 39 రోజుల్లో 912 వాహనాలను సీజ్ చేసి 186 కేసులను నమోదు చేశారు. ఈ మేరకు నిందితులు జరిమానా కింద రూ.22.80 లక్షలు కోర్టుకు చెల్లించినట్టు సమాచారం. ఈ మేరకు వాహనదారులు నిబంధనలకు అనుగుణంగా వాహనాలను నడపాలని, రాంగ్ రూట్‌లో రావడం మానుకోవాలని పోలీసులు సూచిస్తున్నారు. ప్రధానంగా తిరుపతి రూరల్ మండలంలోని సి.మల్లవరం క్రాస్, రామానుజపల్లి క్రాస్, ఆర్‌సీపురం క్రాస్, తనపల్లె క్రాస్, నారాయణాద్రి ఆస్పత్రి క్రాస్ వద్ద రాంగ్‌రూట్ ప్రయాణం శ్రేయస్కరం కాదని హెచ్చరిస్తున్నారు.

ఫలించిన చర్చలు.. దీక్ష విరమణ


విద్యుత్ కాంట్రాక్టు కార్మికుల దీక్షను విరమింపజేస్తున్న డిస్కమ్ అధికారులు

తిరుపతి రూరల్ : ఎస్పీడీసీఎల్ కార్యాలయం ఎదుట సుమారు 16 రోజులుగా రిలే నిరాహారదీక్ష చేపట్టిన విద్యుత్ కాంట్రాక్ట్ కార్మికులతో ఉన్నతాధికారుల చర్చలు బుధవారం ఫలించాయి. సీఎండీ సమక్షంలో జరిగిన చర్చల వివరాలను మినిట్స్ రూపంలో రాతపూర్వకంగా హెచ్ఆర్ డైరెక్టర్ లక్ష్మీనరసయ్య, డీజీఎంలు మూర్తి, సురేంద్ర, ప్రసాద్ తదితరుల దీక్షా శిబిరం వద్ద కార్మికులకు అందించారు. అనంతరం కార్మిక సంఘం నేతలకు నిమ్మరసం ఇచ్చి దీక్షను విరమింపజేశారు. హెచ్ఆర్ డైరెక్టర్ లక్ష్మీ నరసయ్య మాట్లాడుతూ తమ పరిధిలో ఉన్న సమస్యలను వెంటనే పరిష్కరిస్తామని, ఇతర అంశాలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి ప్రయత్నిస్తామని హామీ ఇచ్చారు. వేతనాల పెంపు, పీఆర్ అరియర్స్ తదితర అంశాలను హెచ్ఆర్ కమిటీలో అజెండాగా చేరుస్తామని తెలిపారు. సీపీఎం నేత కందారపు మురళి మాట్లాడుతూ ఇచ్చిన హామీలను చిత్తశుద్ధితో అమలు చేయాలని కోరారు. ఎలక్ట్రిసిటీ ఎంప్లాయీస్ యూనియన్ నేత శివప్రసాద్ రెడ్డి, కాంట్రాక్టు కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కుమార్, చిత్తూరు జిల్లా అధ్యక్షుడు నారాయణ, కడప జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీనివాసులు, అధ్యక్షుడు కొండయ్య, అనంతపురం జిల్లా నేతలు నూర్ బాషా, రాష్ట్ర సహాయ కార్యదర్శి రవికుమార్, పుత్తూరు కార్యదర్శి మురళి పాల్గొన్నారు.

నోటీసుల జారీకి ఆదేశం



ఎంపీడీఓ రామచంద్రతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే పులివర్తి నాని

తిరుపతి రూరల్: మదర్ డెయిరీ యాజమాన్యానికి వెంటనే నోటీసులు జారీ చేయాలని, వ్యర్థాలను బయటకు వదిలితే చర్యలు తప్పవని హెచ్చరించాలని ఎమ్మెల్యే పులివర్తి నాని ఆదేశించారు. తిరుపతి రూరల్ మండలం గాంధీపురం పంచాయతీలోని మదర్ డెయిరీ నుంచి వెలువడుతున్న వ్యర్థాల కారణంగా భూగర్భజలాలు కలుషితమవుతున్నాయని, చుట్టు పక్కల నివాసముంటున్న ప్రజలు దుర్వాసనతో తీవ్రంగా ఇబ్బందిపడుతున్నారు. దీనిపై ఈనెల7వ తేదీన 'కలుషితం.. భూగర్భ జలం..' శీర్షికతో సాక్షి పత్రికలో కథనం ప్రచురితమైంది. దీనిపై ఎమ్మెల్యే స్పందించారు. బుధవారం మండల పరిషత్ కార్యాలయంలో అధికారులతో సమావేశం నిర్వహించారు. అనంతరం జిల్లా అధికారులతో ఫోన్‌లో మాట్లాడారు. మదర్ డెయిరీ నుంచి అవిలాల చెరువులోకి వ్యర్థాలు రాకుండా చూడాలని, చట్ట ప్రకారం చర్యలు తీసుకోవాలని, కాలుష్య నియంత్రణ మండలి అధికారులకు కూడా లేఖ పంపించాలని ఎంపీడీఓ రామచంద్రను ఆదేశించారు. పాల పదార్థాలతో రూ.కోట్ల వ్యాపారం సాగించే డెయిరీ యాజమాన్యానికి ప్రజల ఆరోగ్యంతో ఆడుకునే హక్కు లేదని స్పష్టం చేశారు.

కలెక్టర్‌తో ఐఐటీ డైరెక్టర్ భేటీ


కలెక్టర్‌తో మాట్లాడుతున్న ఐఐటీ తిరుపతి డైరెక్టర్

తిరుపతి అర్బన్ : రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్ ఏర్పాటుతో సరి కొత్త ఆవిష్కరణల దిశగా విద్యార్థులను ప్రోత్సహించవచ్చని తిరుపతి ఐఐటీ డైరెక్టర్ కేఎన్ సత్యనారాయణ తెలిపారు. బుధవారం ఈ మేరకు కలెక్టరేట్‌లో కలెక్టర్‌క వెంకటేశ్వర్‌ను కలిసి చర్చించారు. తిరుపతి ఐఐటీ స్పోక్ హబ్‌గా సేవలందిస్తుందని వెల్లడించారు.

నేడు, రేపు ఏఎన్‌ఎంల ఉద్యోగోన్నతికి కౌన్సెలింగ్

చిత్తూరు రూరల్ (కాణిపాకం) : జిల్లా వైద్య ఆరోగ్యశాఖలో గ్రేడ్–3 ఏఎన్‌ఎం ఉద్యోగోన్నతికి సంబంధించిన తుది జాబితా ఎట్టకేలకు పూర్తయింది. గతేడాది ప్రారంభమైన జాబితా తయారీ ప్రక్రియ...పలు ఆరోపణల నడుమ బుధవారం సాయంత్రానికి పూర్తి చేశారు. 1000 మందిపైగా గ్రేడ్–3 ఏఎన్‌ఎం ఉంటే 307 మందితో ఈ జాబితా సిద్ధం చేశారు. గురు, శుక్రవారాల్లో ఉద్యోగోన్నతికి సంబంధించి కౌన్సెలింగ్ చిత్తూరు నగరంలోని కలెక్టరేట్‌లో నిర్వహించనున్నారు. డీఆర్‌ఓ సమక్షంలో కౌన్సెలింగ్ జరగనున్నట్లు జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారులు చెబుతున్నారు. వీటిపై కొంతమంది మళ్లీ అభ్యంతరం తెలుపుతూ రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ, ఉమ్మడి జిల్లాలోని కలెక్టర్‌లకు ఫిర్యాదు చేశామని అంటున్నారు. దీనిపై అధికారులు ఏ రకంగా స్పందిస్తారో చూడాలి.

నంగా బాబురెడ్డిని చితకబాదిన తెలుగు తమ్ముళ్లు !

– బట్టలు చింపివేసి, కారు అద్దాలు ధ్వంసం – అతని కుమారుడిపైనా దాడి

సాక్షి టాస్క్‌ఫోర్స్: పాకాల జెడ్పీటీసీ సభ్యురాలు నంగా పద్మజారెడ్డి భర్త నంగా బాబురెడ్డిని బుధవారం కొందరు టీడీపీ నాయకులు చితక బాదారని సమాచారం. అడ్డుగా వచ్చిన అతని కుమారుడిపైనా దాడిచేశారని, ఈ గొడవకు కారణం పార్టీలో ఆధిపత్య పోరుగా తెలుస్తోంది. ఈ వ్యవహారం సోషల్ మీడియాలో హల్‌చల్ చేస్తోంది. స్థానికులు అందించిన సమాచారం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. పాకాల మండలం పంటపల్లికి చెందిన నంగా బాబురెడ్డి, అతని కుమారుడు సచిన్‌పై బుధవారం రాత్రి ఇరంగారిపల్లి వద్ద ఈశ్వర చౌదరి వర్గీయులు దాడికి పాల్పడ్డారని సమాచారం. వైఎస్సార్‌సీపీ నుంచి వెళ్లి తెలుగుదేశం పార్టీలో కొనసాగుతున్న బాబురెడ్డిపై టీడీపీకి చెందిన నాయకులే దాడిచేస్తున్నట్టు తెలుసుకున్న పాకాల పోలీసులు అక్కడకు వెళ్లి ఇరువర్గాలకు సర్దుబాటు చేసే ప్రయత్నం చేశారని తెలిసింది. బాబురెడ్డిని పోలీస్‌స్టేషన్‌కు తీసుకొచ్చి లాఠీకి పనిచెప్పారని ప్రచారంలోకి వచ్చింది. తెలుగుదేశం పార్టీలో రెండు వర్గాలు వీధిన పడి తన్నుకున్నారంటే పార్టీ పరువుపోతుందని భయపడ్డ ఓ ప్రజాప్రతినిధి వారిపై ఎలాంటి కేసులు పెట్టొద్దని పాకాల పోలీసులపై ఒత్తిడి తెచ్చినట్టు సమాచారం. ఇరు వర్గాలతో మాట్లాడి ఫిర్యాదులు అందకుండా చూస్తానని పోలీసులకు హామీ ఇవ్వడంతో పోలీసులు ఆ వ్యవహారం నుంచి తప్పుకున్నట్టు తెలుస్తోంది. మిమ్మల్ని నమ్మి వైఎస్సార్‌సీపీ నుంచి వచ్చినందుకు ఇలా కొట్టిస్తారా..? అంటూ గాయపడ్డ బాబురెడ్డి, అతని కుమారుడు ఆ ప్రజాప్రతినిధి వద్ద ఆవేదన వ్యక్తం చేసినట్టు సమాచారం. వైఎస్ఆర్ సీపీ నుంచి ఎన్నికలకు ముందు టీడీపీలోకి వెళ్లిన బాబు రెడ్డి తీరు నచ్చకుండా అప్పటికే టీడీపీలో కీలకంగా వ్యవహరిస్తున్న వారి మధ్య విభేదాలు నెలకొన్నట్టు తెలుస్తోంది. ఇదిలా ఉండగా ఎన్నికలకు ముందు, తరువాత కూడా బాబు రెడ్డి, అతని కుటుంబాన్ని అవసరాలకు వాడుకున్నారేగానీ ఎక్కడా గౌరవించిన దాఖలాలు లేవని బాబురెడ్డి వర్గీయులు విమర్శిస్తున్నారు.

వెటర్నరీ వర్సిటీలో మధ్యప్రదేశ్ మంత్రి


అధికారుల సమావేశంలో లకన్ పాటిల్

తిరుపతి సిటీ : ఎస్వీ వెటర్నరీ వర్సిటీలో బుధవారం మధ్యప్రదేశ్ మంత్రి లకన్ పాటిల్ పర్యటించారు. ఈ సందర్భంగా వీసీ రమణ, డీన్ వీరబ్రహ్మయ్య, ఇన్‌చార్జి రిజిస్ట్రార్ శ్రీలతతో సమావేశమయ్యారు. వర్సిటీలో చేపట్టిన పరిశోధనలు, పశువైద్య విద్య, పలు విభాగాల పనితీరును అడిగి తెలుసుకున్నారు. అనంతరం పశువైద్య శాలను పరిశీలించారు.

సజావుగా దూరవిద్య పరీక్షలు

తిరుపతి సిటీ : ఎస్వీయూ దూరవిద్య విభాగం ఆధ్వర్యంలో ఈనెల 2వ తేదీ నుంచి నిర్వహిస్తున్న యూజీ, పీజీ పరీక్షలు సజావుగా సాగుతున్నట్లు డైరెక్టర్ పూశా రమేష్ బాబు తెలిపారు. బుధవారం ఆయన మాట్లాడుతూ దాదాపు 32 వేల మంది విద్యార్థులు పరీక్షలకు హాజరవుతున్నారని వెల్లడించారు. ప్రధాన కోర్సుల పరీక్షలు ముగిశాయని, యూజీకి చెందిన కొన్ని ప్రత్యేక పరీక్షలు మరో వారంలో ముగియనున్నట్లు వివరించారు. ఇప్పటి వరకు పరీక్షలను పారదర్శకంగా ఎలాంటి సమస్యలు తలెత్తకుండా పూర్తి చేసినట్లు వెల్లడించారు. సహకరిస్తున్న పోలీస్‌శాఖతోపాటు ప్రభుత్వ కళాశాలల అధ్యాపకులకు కృతజ్ఞతలు తెలిపారు.

విద్యార్థిని సృజనకు అభినందన


వైష్ణవిని అభినందిస్తున్న వీసీ, అధ్యాపకులు

తిరుపతి సిటీ : పద్మావతి మహిళా వర్సిటీ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫార్మాస్యూటికల్ టెక్నాలజీలో బీఫార్మసీ విద్యార్థిని వైష్ణవీ హరీష్ తన సృజనాత్మకతను ఆవిష్కరించారు. స్మార్ట్ డిజిటల్ స్టెతస్కోప్‌ను రూపొందించారు. యూఎస్ ఎంబసీ సహకారంతో ఉకాన్ గ్లోబల్ సంస్థ భాగస్వామ్యంతో ఢిల్లీలోని అమెరికన్ సెంటర్‌లో నిర్వహించిన స్టార్టప్ నెక్సస్ కోహోర్ట్–20 ప్రోగ్రామ్‌లో ఈ పరికరం ప్రదర్శించి సర్టిఫికెట్ అందుకున్నారు. బుధవారం ఈ మేరకు వర్సిటీ వీసీ ప్రొఫెసర్ ఉమ, విభాగాధిపతి ప్రొఫెసర్ జ్యోత్స్నారాణి అభినందనలు తెలిపారు.

అటవీశాఖ అధికారికి జైలు

సూళ్లూరుపేట రూరల్ : మహిళా ఉద్యోగిని వేధించిన కేసులో అటవీశాఖ అధికారి వరప్రసాద్‌రావుకు మూడు నెలలు జైలు శిక్ష, 5వేలు జరిమానా విధిస్తూ సూళ్లూరుపేట ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి ఎస్.అనిల్‌కుమార్ బుధవారం తీర్పునిచ్చారు. వివరాలు.. 2023లో దొరవారిసత్రం మండలం నెలపట్టు పక్షుల కేంద్రంలో ఎస్కే అస్మతున్నీసా అనే అటవీశాఖ మహిళా ఉద్యోగినితో వరప్రసాద్‌రావు అభ్యంతరకరంగా ప్రవర్తించారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు ప్రవర్తించడంతో దొరవారి సత్రం పోలీసులు కేసు నమోదు చేసి నిందితుడిని కోర్టులో హాజరుపరిచారు. ఈ మేరకు న్యాయమూర్తి విచారణ చేపట్టి నిందితుడిపై నేరం రుజువు కావడంతో శిక్ష విధించారు. ప్రాసిక్యూషన్ తరఫున కేసును అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ కేజే ప్రకృతి కుమార్ వాదనలు వినిపించారు.

క్లుప్తంగా

విద్యార్థుల స్థాయికి తగ్గట్టు విద్యాబోధన



-కింద కూర్చుని విద్యార్థుల పాఠం చెబుతున్న ఎంఈఓ బాబ్జి

పాకాల: విద్యార్థుల స్థాయికి తగ్గట్టు ఉపాధ్యాయులు విద్యాబోధన చేయాలని ఎంఈఓ బాబ్జి అన్నారు. బుధవారం మండలంలోని పెద్దమ్మగారిపల్లె, పులివర్తివారిపల్లె ఎంపీపీ పాఠశాలలను ఆయన తనిఖీ చేశారు. విద్యార్థుల వర్క్‌బుక్స్‌ను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, విద్యార్థులకు సులువుగా అర్థమయ్యేలా టీచర్లు పాఠాలు చెప్పాలని, అవసరమైతే విద్యార్థులతో పాటు కింద కూర్చుని బోధించాలన్నారు.

విద్యార్థులకు ఇంటర్న్‌షిప్‌పై అవగాహన



మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ సత్యనారాయణ

తిరుపతి సిటీ: స్థానిక ఎస్‌జీఎస్ ఆర్ట్స్ కళాశాలలో విద్యార్థులకు షార్ట్ టర్మ్ ఇంటర్న్‌షిప్‌పై బుధవారం కళాశాలలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ప్రిన్సిపాల్ డాక్టర్ బీ.సత్యనారాయణ మాట్లాడుతూ, విద్యార్థులకు నైపుణ్య శిక్షణ కీలకమని, దీంతో మెరుగైన ఉద్యోగాలను సాధించవచ్చన్నారు. జగతి నెట్ వర్క్స్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ సంస్థతో అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేసి నైపుణ్య శిక్షణ ఉపయోగాలు సర్టిఫికెట్స్ గురించి విద్యార్థులకు అవగాహన కల్పించామన్నారు. కార్యక్రమంలో నోడల్ ఆఫీసర్ బీ.సులోచనరాణి, వైస్ ప్రిన్సిపాల్ పరమేశ్వర, ఇంగ్లిష్ విభాగాధిపతి చంద్రయ్య, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఎన్‌సీసీ ట్రైనింగ్ షెడ్ ప్రారంభం



ఎన్‌సీసీ క్యాడెట్లతో మాట్లాడుతున్న గల్లా రామచంద్రనాయుడు, అధికారులు

తిరుపతి సిటీ: స్థానిక ఎన్‌సీసీ నగర్‌లో క్యాడెట్ల సౌకర్యార్థం ఏర్పాటు చేసిన నూతన ట్రైనింగ్ కమ్ రెసిడెన్షియల్ షెడ్‌ను బుధవారం ప్రారంభించారు. తన ఆర్థిక సాయంతో షెడ్‌ను నిర్మించిన అమరరాజా గ్రూప్ చైర్మన్ డాక్టర్ గల్లా రామచంద్రనాయుడు ముఖ్యఅతిథిగా ఎన్‌సీసీ గ్రూప్ హెడ్ క్వార్టర్స్ గ్రూప్ కమాండర్ కల్నల్ సతీందర్ దహియాతో కలసి దీనిని ప్రారంభించారు.

ఆర్‌పీఎఫ్ డ్రై క్యాంటీన్ ప్రారంభం



క్యాంటీన్ ప్రారంభోత్సవంలో దక్షిణ మధ్య రైల్వే ప్రధాన భద్రతా కమిషనర్ అరోమా సింగ్ ఠాకూర్

తిరుపతి అర్బన్: ఎస్వీ యూనివర్సిటీ మార్గంలోని ఆర్‌పీఎఫ్ బ్యారక్స్‌లో బుధవారం ఆర్‌పీఎఫ్ డ్రై క్యాంటీన్‌ను దక్షిణ మధ్య రైల్వే ప్రధాన భద్రతా కమిషనర్ అరోమా సింగ్ ఠాకూర్ ప్రారంభించారు. ఆమె మాట్లాడుతూ, అన్నిరకాల వస్తువులు, సరుకులు, ఎలక్ట్రానిక్ ఉపకరాలు ఈ క్యాంటీన్‌లో అందుబాటులో తెస్తామన్నారు. ప్రతి వస్తువుపై 20 నుంచి 40శాతం వరకు తగ్గింపు ఉంటుందన్నారు. కార్యక్రమంలో గుంతకల్ డివిజన్ సెక్యూరిటీ కమిషనర్ మురళీకృష్ణ, అసిస్టెంట్ సెక్యూరిటీ కమిషనర్ రాజగోపాల్‌రెడ్డి, డీఎస్పీ హర్షిత, ఆర్పీఎఫ్ ఇన్‌స్పెక్టర్ మధుసూదన్, ఎస్ఐ రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఎన్‌ఎస్‌యూఐ దినోత్సవం

తిరుపతి సిటీ: ఎన్‌ఎస్‌యూఐ 55వ ఆవిర్భావ దినోత్సవాన్ని ఎస్వీయూలో రాష్ట్ర కార్యదర్శి జెన్నే మల్లికార్జున ఆధ్వర్యంలో ప్రకాశం భవన్ ఎదుట నిర్వహించారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు బాలగురువం బాబు, మురళీకృష్ణ, లోకేష్‌రెడ్డి, ఖలీల్, శంకర్, కుమార్, కేదర్ పాల్గొన్నారు.

కృత్రిమ మేధే కీలకం

- విద్యార్థులు కృత్రిమ మేధపై దృష్టి సారించాలి
- అకడమిక్ విద్యతో పాటు స్కిల్ డెవలప్‌మెంట్‌కు ప్రాధాన్యత
- ఏఐ అవగాహన సదస్సులో వీసీ అప్పారావు



ఏఐ శిక్షణ కార్యక్రమంలో ప్రసంగిస్తున్న వీసీ అప్పారావు

తిరుపతి సిటీ: ఉద్యోగ, ఉపాధి అవకాశాలలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజన్స్ (కృత్రిమ మేధ) కీలక పాత్ర పోషించనుందని ఎస్వీయూ వీసీ సీహెచ్ అప్పారావు అన్నారు. బుధవారం ఎస్వీయూ శ్రీనివాస ఆడిటోరియంలో మైక్రోసాఫ్ట్ ఏఐపై మూడు రోజుల శిక్షణ ప్రారంభ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఇంజినీరింగ్, కంప్యూటర్ విభాగాలతో పాటు అన్ని విభాగాలకు చెందిన విద్యార్థులు ఏఐ కోడింగ్‌పై దృష్టి సారించాలని పిలుపునిచ్చారు. భవిష్యత్ ఏఐదేనని, విద్యార్థులు అకడమిక్ విద్యతో పాటు స్కిల్ డెవలప్‌మెంట్‌కు ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. ఆధునిక ప్రపంచాన్ని, ఉపాధి రంగాన్ని ఏఐ శాసించబోతుందన్నారు. కార్యక్రమంలో ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపల్ శ్రీనివాసులు, కామర్స్ అండ్ కంప్యూటర్ సైన్స్ ప్రిన్సిపల్ నరసయ్య, భవాని శంకర్, ప్రొఫెసర్ సుబ్బారావు, ప్రొఫెసర్ శ్రీమురళి, ప్రొఫెసర్ హేమ, సుధాకర్ శర్మ, భవాని శంకర్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఇంటర్వ్యూలను ఎదుర్కోవాలంటే అవగాహన అవసరం



పీజీ పూర్తి చేశాక పారిశ్రామిక రంగంలో అడుగు పెట్టాలన్నా, పేరొందిన సంస్థలు నిర్వహించే ఇంటర్వ్యూలలో ఏఐపై సంధించే ప్రశ్నలను ఎదుర్కోవాలన్నా ఏఐపై అవగాహన అవసరం. ఇలాంటి సదస్సులతో కాస్త అవగాహన కలుగుతుంది.

-లిఖిత, విజయ,
ఎంబీఏ విద్యార్థినులు, ఎస్వీయూ

ప్రతిభకు ఏఐ కొలమానం



రానున్న రోజులలలో ప్రతిభకు కొలమానంగా ఏఐ నిలువనుంది. ప్రతి విద్యార్థి తాము చదువుతున్న కోర్సులతో సంబంధం లేకుండా ఆర్టిఫిషియల్ ఇంటెలిజన్స్‌పై అవగాహన పెంచుకోవాలి. అన్ని రంగాలలో భవిష్యత్తులో ఏఐ పాత్ర కీలకం కానుంది. ప్రత్యేకంగా ఏఐ శిక్షణా సెంటర్‌ను ఏర్పాటు చేస్తే విద్యార్థులకు ఎంతో ఉపయోగకరం

-కరూర్ అబ్బాస్, మధు, పీజీ విద్యార్థులు, ఎస్వీయూ

-ఏఐపై అవగాహన తప్పనిసరి



ఆధునిక పోటీ ప్రపంచాన్ని ఎదుర్కోవాలంటే ఆర్టిఫిషియల్ ఇంటెలిజన్స్‌పై పట్టు సాధించాలని బోధపడింది. అకడమిక్ విద్య ఎంత ముఖ్యమో రానున్న రోజులలో ఉద్యోగావకాశాలు అందిపుచ్చుకోవాలంటే ఏఐపై దృష్టి సారించాల్సిందే. ఆ దిశగా ప్రయత్నాలు చేసేందుకు సిద్ధమవుతున్నాం

-లహరి, మేరీ గ్రేస్,
బీటెక్ విద్యార్థినులు, ఎస్వీయూ

ఆర్టిఫిషియల్ ఇంటెలిజన్స్ ప్రాధాన్యత తెలిసింది



ఉపాధి, ఉద్యోగ అవకాశాలలో ఏఐ ప్రాధాన్యత ఈ సదస్సులో తెలుసుకున్నాం. ఏ విభాగంలో పీజీ, పీహెచ్‌డీలు వంటి ఉన్నత చదువులు అభ్యసించి ఆర్టిఫిషియల్ ఇంటెలిజన్స్‌పై అవగాహన లేకపోతే ఉపాధి కష్టమవుతుంది. పారిశ్రామిక, ఐటీ రంగాలలో ఉన్నత శిఖరాలు అధిరోహించాలంటే ఏఐపై పట్టు అవసరం.

-సాహిత్య, ఉమ,
పీజీ విద్యార్థినులు, ఎస్వీయూ

నోటీస్ బోర్డు

- శ్రీకోదండరామస్వామి ఆలయంలో రాత్రి 7 నుంచి 8 గంటల వరకు తెప్పోత్సవాలు, తొలుత ఉదయం 8 నుంచి 9.30 గంటల వరకు స్వామివారికి స్నపన తిరుమంజనం
- ఎస్వీ యూనివర్సిటీలోని సెనేట్ హాల్లో ఉదయం 9 గంటలకు రెండవ రోజు సాంప్రదాయ ఔషధంపై అంతర్జాతీయ సదస్సు
- వైఎస్సార్‌సీపీ ముస్లిం మైనారిటీ విభాగం ఆధ్వర్యంలో ఉదయం 10 గంటలకు మహతి సమీపంలోని పెద్ద మసీదు వద్ద వక్ఫ్ బోర్డు బిల్లుకు వ్యతిరేకంగా ధర్నా
- మహిళలకు ఉచిత టైలరింగ్ శిక్షణ పొందిన మహిళలకు ఎంఎస్ఎస్ఆర్ ట్రస్ట్ ఆధ్వర్యంలో హోటల్ విక్రమ్‌లో ఉదయం 10.30 గంటలకు సర్టిఫికెట్లు పంపిణీ

ఆధార్ ప్రత్యేక శిబిరాలు

భాకరాపేట : విద్యార్థులు, చిన్న పిల్లలు కోసం ఏర్పాటు చేసిన ఆధార్ ప్రత్యేక శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీఓ గిద్దయ్య కోరారు. చిన్నగొట్టిగల్లు మండలం రంగన్నగారిగడ్డ, చట్టివారిపాళెం సచివాలయాల్లో ఏర్పాటు చేసిన ప్రత్యేక ఆధార్ శిబిరాలను బుధవారం ఆయన పరిశీలించి మాట్లాడారు.11వ తేదీ వరకు ఈ శిబిరాలు నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో ఈఓపీఆర్‌డీ సోమశేఖర్‌రెడ్డి, డిజిటల్ అసిస్టెంట్లు వికాష్‌రెడ్డి, శ్రీహరి తదితరులు పాల్గొన్నారు.

ఆయన త్యాగాలు యువతకు ఆదర్శం



నివాళులు అర్పిస్తున్న సీపీఐ నేతలు

తిరుపతి కల్చరల్: స్వాతంత్ర్య సమరయోధుడు, కమ్యూనిస్టు పార్టీ జాతీయ మాజీ ప్రధాన కార్యదర్శి కామ్రేడ్ చంద్ర రాజేశ్వరరావు త్యాగాలు ఇప్పటి యువత ఆదర్శంగా తీసుకోవాలని సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు రామానాయుడు పిలుపునిచ్చారు. బైరాగిపట్టెడలోని సీపీఐ కార్యాలయంలో బుధవారం చంద్ర రాజేశ్వరరావు 31వ వర్ధంతి నిర్వహించి సీపీఐ నాయకులు మాట్లాడారు. కార్యక్రమంలో సీపీఐ నేతలు చిన్నం పెంచలయ్య ,విశ్వనాథ్, ఉదయ్‌కుమార్, రాధాకృష్ణ, ఎన్‌డీ.రవి, బండి చలపతి, రామకృష్ణ, నాగరాజు, గోవింద స్వామి, శ్రీనివాసులు, సురేష్ పాల్గొన్నారు.

వృద్ధుడి మృతి



మృతి చెందిన చెంగల్రాయులు

చంద్రగిరి : మండలంలోని గంగుడుపల్లె సమీపంలో బుధవారం సాయంత్రం ఓ వృద్ధుడు మృతి చెందాడు. వివరాలు.. చిత్తూరు జిల్లా వెదురుకుప్పం మండలం కాపు మొండివెంగనపల్లెకు చెందిన చెంగల్రాయులు(65) చంద్రగిరిలోని ఓ శుభకార్యానికి హాజరయ్యాడు. మద్యం సేవించి తిరుగుప్రయాణమయ్యాడు. బస్టాప్ సమీపంలో ఆటో కోసం వేచి చూస్తూ ప్రమాదవశాత్తు కల్వర్టు మీద నుంచి కింద పడిపోయాడు. స్థానికులు పరిశీలించగా అప్పటికే మృతి చెందినట్లు గుర్తించారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటన స్థలానికి చేరుకుని మృతుడి కుటుంబీకులకు తెలియజేశారు.

‘స్వచ్ఛ సర్వేక్షణ్’లో తిరుపతి ముందుండాలి



పారిశుద్ధ్య పనులను పరిశీలిస్తున్న కమిషనర్

తిరుపతి తుడా: నగరంలో పారిశుద్ధ్య పనులు మెరుగ్గా చేస్తూ స్వచ్ఛసర్వేక్షణ్‌లో తిరుపతి ముందుండేలా చూడాలని, ప్రజలను ఆ దిశగా చైతన్యవంతుల్ని చేయాలని నగరపాలక సంస్థ కమిషనర్ ఎన్ మౌర్య అధికారులను ఆదేశించారు. 25 వార్డులోని కర్ణాల వీధి, అరవల్లి వీధి, వేశాలమ్మ గుడి వీధి, బలిజ వీధి తదితర ప్రాంతాల్లో పారిశుద్ధ్య పనులను కమిషనర్ పరిశీలించి మాట్లాడారు. కార్యక్రమంలో మునిసిపల్ ఇంజినీర్ తులసి , హెల్తాఫీసర్ డాక్టర్ యువ అన్వేష్, డీఈ రాజు, ఏసీపీ బాలాజి, సర్వేయర్ కోటేశ్వరరావు, శానిటరీ సూపర్‌వైజర్ చెంచయ్య తదితరులు పాల్గొన్నారు.

‘ప్రసవం వరకు విధిగా వైద్య పరీక్షలు ముఖ్యం’



మాట్లాడుతున్న స్విమ్స్ డైరెక్టర్ కుమార్

తిరుపతి తుడా: స్విమ్స్‌లో బుధవారం ప్రపంచ ఆరోగ్య దినోత్సవం ఘనంగా నిర్వహించారు. కమ్యూనిటీ మెడిసిన్ విభాగం ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా డైరెక్టర్ కమ్ వీసీ డాక్టర్ ఆర్వీ కుమార్ మాట్లాడారు. తల్లులు, నవజాతి శిశువుల ఆరోగ్య సంరక్షణ, మాతా–శిశు మరణాలకు అడ్డుకట్ట వేయడంపై అవగాహన కల్పించడం ముఖ్య ఉద్దేశమన్నారు. కమ్యూనిటీ మెడిసిన్ విభాగాధిపతి డాక్టర్ నాగరాజ్, పిడియాట్రిక్స్ విభాగాధిపతి డాక్టర్ పునీత్, డాక్టర్ ప్రత్యూష, మంగళం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం మెడికలాఫీసర్ డాక్టర్ స్రవంతి, స్విమ్స్ గైనకాలజి విభాగం డాక్టర్ భార్గవి, వైద్యులు, నర్సింగ్ సిబ్బంది, ఆశా వర్కర్లు, ప్రజలు పాల్గొన్నారు.

అధికారులపై ధ్వజమెత్తిన సభ్యులు

-హాట్..హాట్‌గా చంద్రగిరి మండల సమావేశం



ఉపాధి నిధుల అక్రమాలపై అధికారులను నిలదీస్తున్న సర్పంచ్ భాస్కర్ రెడ్డి

చంద్రగిరి: గత సమావేశంలో ప్రస్తావించిన సమస్యలను ఇప్పటివరకూ పరిష్కరించిన పాపానపోలేదంటూ సభ్యులు అధికారులపై ధ్వజమెత్తారు. బుధవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ హేమేంద్ర కుమార్ రెడ్డి అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. పలువురు సభ్యులు సమస్యలపై అధికారులను నిలదీశారు. మండల నిధులతో రెడ్డివారిపల్లె సమీపంలోని ముస్లిం మైనార్టీల భూమిలో నిర్మించిన రెండు దుకాణాలకు విద్యుత్ కనెక్షన్ కోసం ఎన్‌ఓసీ అడుతున్నా ట్రాన్స్‌కో అధికారులు పట్టించుకోలేదంటూ ఎంపీటీసీ అజీజ్ నుస్రత్ మండిపడ్డారు. అలాగే, చంద్రగిరి రెడ్డివీధిలో ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేయాలని రెండు నెలలుగా కోరుతున్నా చర్యలు తీసుకోవడం లేదని ఎంపీటీసీ సుజాత, బుల్లెట్ చంద్రమౌళిరెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. అగరాల పంచాయతీ జగనన్న కాలనీలో సాయంత్రమైతే ఆకతాయిల ఆగడాలు అధికమవుతున్నాయని తెలిపారు. జగనన్న కాలనీ సమీపంలోని పొలాల్లో రాత్రుల్లో కొందరు వన్యప్రాణుల వేటకు విద్యుత్ తీగలు ఏర్పాటు చేస్తున్నారని, వీటి బారిన పడి వన్యప్రాణులు మరణించిన ప్రతిసారీ విద్యుత్ సరఫరాకు తీవ్ర అంతరాయం కలుగుతోందన్నారు. ఎంపీపీ, జెడ్పీటీసీ యుగంధర్ రెడ్డి మాట్లాడుతూ, వచ్చే సమావేశంలోపు సమస్యలను పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు.

సర్పంచ్‌కు కాదని ఉప సర్పంచ్‌కు ఆహ్వానం..!

రామిరెడ్డిపల్లె పంచాయతీకి ఇటీవల ఉపసర్పంచ్‌గా ఎన్నికైన వ్యక్తి సమావేశానికి హాజరు కావడంపై ప్రజాప్రతినిధులు ఆగ్రహం వ్యక్తం చేశారు. సర్పంచ్‌ను కాదని ఏ అర్హతతో ఉప సర్పంచ్‌ను ఆహ్వానించారంటూ అధికారులను నిలదీశారు.

క్రమశిక్షణ విద్యతో సమాజానికి ఉపయోగపడే పౌరులు

– ఎంపీ డాక్టర్ గురుమూర్తి



పట్టాలందుకున్న చిన్నారులతో ఎంపీ గురుమూర్తి, పాఠశాల అధినేతలు

తిరుపతి కల్చరల్: ప్రాథమిక స్థాయి నుంచే విద్యార్థులకు క్రమశిక్షణతో కూడిన విద్యనందిస్తే సమాజానికి ఉపయోగపడే పౌరులను అందించినట్లవుతుందని ఎంపీ డాక్టర్ ఎం.గురుమూర్తి అన్నారు. కరకంబాడి రోడ్డులోని అట్లాంటిస్ పాఠశాల 4వ వార్షికోత్సవం బుధవారం మహతి కళాక్షేత్రంలో ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఎంపీ హాజరై చిన్నారులకు పట్టాలు అందజేసి మాట్లాడారు. విలువలతో కూడిన విద్యను అందించడంలో అట్లాంటిస్ పాఠశాలను నిర్వహిస్తున్న ఎస్వీ చిల్డ్రన్స్ హైస్కూల్ యాజమాన్యానికి నాలుగు దశాబ్దాల అనుభవం ఉందని కితాబిచ్చారు. మరో అతిథి శాప్ చైర్మన్ రవినాయుడు మాట్లాడుతూ, పిల్లలను క్రీడల్లోనూ ప్రోత్సహించాలని కోరారు. అనంతరం చిన్నారులు తమ నృత్యాలతో అదుర్స్ అనిపించారు. పాఠశాల అధినేత కేఎస్.వాసు మాట్లాడుతూ, విద్యార్థులకు మన సంస్కృతి, సంప్రదాయాలపై ఆసక్తిని కలిగించడం పాఠశాల ప్రత్యేకత అని తెలిపారు.కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ ప్రమీల కృష్ణన్, వైస్ ప్రిన్సిపాల్ మోహకర్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సాహిత్యం సమాజానికి తరగని సంపద



సత్కారం అందుకున్న పురస్కారాల గ్రహీతలు, నిర్వాహకులు

తిరుపతి కల్చరల్: సాహిత్యం సమాజానికి తరగని సంపద అని, దీనిని భావి తరాలకు అందించాలని సంస్కృత వర్సిటీ ఉపకులపతి ఆచార్య జీవీఎస్ఆర్.కృష్ణమూర్తి అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం నుంచి కళారత్న, ఉగాది పురస్కారాలు అందుకున్న వారికి బుధవారం బుధవారం వేమన విజ్ఞాన కేంద్రం, జిల్లా రచయితల సంఘం సంయుక్త ఆధ్వర్యంలో అభినందన సభ నిర్వహించారు. ముఖ్య అతిథిగా సంస్కృత వర్సిటీ వీసీ మాట్లాడారు. ఆచార్య గార్లపాటి దామోదర నాయుడు, ఉమ్మడి చిత్తూరు జిల్లా పురస్కార గ్రహీతలను సభకు పరిచయం చేశారు. పురస్కారాల గ్రహీతలు ఆచార్య కిరణ్ క్రాంతి చౌదరి, ఆముదాల మురళి, డాక్టర్ వీఆర్.రాసాని, డాక్టర్ శ్రీవాణి ఎల్ల, డాక్టర్ ఉమా ముద్దుబాల, ఆకుల మల్లేశ్వరరావు, సాధన మునిరత్నం, పురుషోత్తమ నాయుడు, తులసీనాథం నాయుడు, ముని మల్లిఖార్జున, పద్మనాభం, ఆర్‌సీ కే.రాజు, పేట యుగంధర్‌లను శాలువ, జ్ఞాపికలతో ఘనంగా సత్కరించి అభినందించారు. సాహితీవేత్తలు సాకం నాగరాజు, తోట వెంకటేశ్వర్లు, మన్నవ గంగాధర ప్రసాద్, ఏనుగు అంకమ నాయుడు, టింకాల దామోదరం, మల్లారపు నాగార్జున, ఆచార్య సర్వోత్తమరావు, డాక్టర్ తమటం రామచంద్రారెడ్డి, డాక్టర్ మస్తానమ్మ, జయరాం ప్రసాద్, పేరూరు బాలసుబ్రమణ్యం, సుభద్ర, శోభ, నడ్డి నారాయణ, నెమిలేటి కిట్టన్న పాల్గొన్నారు.

బ్రాహ్మణులకు క్రెడిట్ సొసైటీ రుణాలు

తిరుపతి కల్చరల్: బ్రాహ్మణుల ఆర్థిక అవసరాలకు తక్కువ వడ్డీకి ఆంధ్రప్రదేశ్ బ్రాహ్మణ కో–ఆపరేటివ్ క్రెడిట్ సొసైటీ రుణ సదుపాయం కల్పిస్తున్నట్లు టీడీపీ బ్రాహ్మణ సాధికార సమితి రాష్ట్ర సభ్యుడు హనుమంతరావు తెలిపారు. బుధవారం ప్రెస్ క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన సీఈఓతో కలిసి రుణాల వివరాల కరపత్రాలను ఆవిష్కరించి మాట్లాడారు. పొదుపు ఖాతాలపై 5 శాతం, ఫిక్స్‌డ్ డిపాజిట్లపై సీనియర్ సిటిజన్లకు 10 శాతం వడ్డీలు ఇస్తోందన్నారు. ఒక ప్రైవేటు బ్యాంకుతో అవగాహన కుదుర్చుకుని ఏటీఎం కార్డు కూడా ఇచ్చేందుకు కార్యాచరణ ప్రారంభించామని, దీనిని జిల్లాలోని బ్రాహ్మణులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. సమావేశంలో సొసైటీ గవర్నర్ బాడీ సభ్యులు సీఆర్‌కే.శేషగిరిరావు, జయలక్ష్మి, హారిక పాల్గొన్నారు.

పిచ్చిమొక్కలు తొలగించిన పోలీసులు

తిరుపతి రూరల్: తిరుపతి రూరల్ మండలం మల్లంగుంట, గాంధీపురం పంచాయతీలోని రాజీవ్ గృహకల్ప కింద నిర్మించిన అపార్ట్‌మెంట్ ప్రాంతంలో చిట్టడవిని తలపించేలా ఉన్న ముళ్ల చెట్లు, పిచ్చిమొక్కలను బుధవారం జేసీబీలతో పోలీసులు తొలగించారు. భద్రతకు సంబంధించి తీసుకోవాల్సిన చర్యలపై అక్కడి వారితో మాట్లాడారు. కార్యక్రమంలో సీఐ చిన్నగోవిందు, పోలీసులు పాల్గొన్నారు.

మందుబాబులకు జరిమానా

తిరుపతి లీగల్: మద్యం సేవించి తిరుపతిలో వాహనాలు నడుపుతున్న 9 మందికి ఒక్కొక్కరికి రూ.10వేల చొప్పున జరిమానా విధిస్తూ తిరుపతి 4వ అదనపు జూనియర్ సివిల్ జడ్జి గ్రంధి శ్రీనివాస్ బుధవారం తీర్పు చెప్పారు. ట్రాఫిక్ పోలీసులు నగరంలో తనిఖీలు నిర్వహించి మద్యం తాగి వాహనాలు నడుపుతున్న వారిపై కేసులు నమోదు చేసి కోర్టులో హాజరు పరచడంతో న్యాయమూర్తి జరిమానా విధించారు.

రాయితీపై మామిడి కవర్లు

భాకరాపేట : రాయితీపై కవర్లను మామిడి రైతులకు ఇస్తున్నట్టు చిన్నగొట్టిగల్లు ఉద్యాన శాఖాధికారి శివకుమారి అన్నారు. బుధవారం భాకరాపేటలో బాలాజీ రైతు సంఘం ఆధ్వర్యంలో మామిడి రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో రాస్ సంస్థ మేనేజర్ మోహన్, నెప్టం ప్రాజెక్టు అధికారులు నాగరాజ, కిరణ్, బాలాజీ రైతు సంఘం రైతులు, రాస్ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

ఆ మద్యం షాపు తొలగించండి

తిరుపతి సిటీ: బైరాగి పట్టెడ, సాయినగర్ గృహ సముదాయాల మధ్య ఏర్పాటు చేసిన మద్యం షాపును తక్షణమే తొలగించాలని సీపీఐ నాయకులు డిమాండు చేశారు. ఇదే విషయమై ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్రను బుధవారం మహిళా వర్సిటీలో కలసి వినతి పత్రం అందజేశారు. నగర కార్యదర్శి విశ్వనాథ్ మాట్లాడుతూ, రెండు నెలలుగా స్థానిక మహిళలు, విద్యార్థుల నిరసనతో మూసివేసిన మద్యం షాపును మళ్లీ ఎక్సైజ్ అధికారులు ముడుపులకు అమ్ముడుపోయి తెరిపించారని ఆరోపించారు. మంత్రిని కలిసిన వారిలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు చిన్న పెంచలయ్య, రాధాకృష్ణ, నగర కార్యవర్గ సభ్యులు రవి, పద్మారెడ్డి, రామకృష్ణ ఉన్నారు.

రాజకీయ కక్షలతో సంఘమిత్రలను తొలగించొద్దు



హైకోర్టు ఆర్డర్ కాపీతో పాటు ఎంపీడీఓ రామచంద్రకు వినతి పత్రం ఇస్తున్న బాధితురాలు ధనలక్ష్మి

తిరుపతి రూరల్ : రాజకీయ కక్షలతో పొదుపు సంఘాల్లోని సంఘమిత్రలను తొలగించరాదని ఎంపీపీ మూలం చంద్రమోహన్ రెడ్డి ఎంపీడీఓ రామచంద్రకు హితవు పలికారు. కొంత కాలంగా కేసీపేటకు చెందిన సంఘమిత్ర ధనలక్ష్మిని తొలగించాలని వెలుగు ప్రాజెక్టు ఏపీఎం నాగేశ్వరరావు తమ సిబ్బందితో వేధిస్తుండడంపై స్థానిక వైఎస్సార్‌సీపీ నేత తులసీరెడ్డి సహకారంతో ఆమె హైకోర్టును ఆశ్రయించారు. దీనిపై కోర్టు ధనలక్ష్మిని సంఘమిత్రగా కొనసాగించాలన్న ఉత్తర్వులు జారీ చేసింది. ఈ ఉత్తర్వులతో ఆమె ఎంపీపీని కలిశారు. దీనిపై స్పందించిన ఆయన పైవిధంగా అధికారులకు హితవు పలికారు.గ్రూపు సభ్యులు వద్దంటే తప్ప ఇకపై అడ్డదారిలో తొలగించవద్దని, ధనలక్ష్మి తీసుకువచ్చిన వినతి పత్రంతో పాటు కోర్టు ఉత్తర్వులను వైస్ఎంపీపీ మాధవరెడ్డి, యశోదతో కలసి ఎంపీడీఓకు అందజేశారు.